క్లుప్తంగా

మహిళలు, రైతులకు విరివిగా రుణాలు



ఏపీజీబీ శాఖను ప్రారంభిస్తున్న చైర్మన్ రాకేష్ కష్యప్

కలువాయి: స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులకు తమ బ్యాంకు ద్వారా విరివిగా రుణాలు అందజేస్తామని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్ రాకేష్ కష్యప్ అన్నారు. కలువాయి ఏపీజీబీ బ్రాంచ్‌ని నూతన భవనంలోకి మార్చిన నేపథ్యంలో గురువారం ఆయన బ్యాంకు సేవలను జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. నెల్లూరు రీజియన్‌లో అన్ని శాఖలకు నగదును తరలించేందుకు కొనుగోలు చేసిన కొత్త క్యాష్ వ్యానును కూడా ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఆర్‌ఎం శైలేంద్రనాథ్, బ్రాంచ్ మేనేజర్ ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న సీఐ సోమయ్య

నాయుడుపేటటౌన్: రూరల్‌సర్కిల్‌లోని పెళ్లకూరు, ఓజిలి, దొరవారిసత్రం మండల్లాలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరాల నియంత్రణకు ఎస్‌ఐలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని రూరల్ సీఐ వైవీ సోమయ్య సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. స్టేషన్‌ల వారీగా సీఐ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు లేకుండా చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వేసవిలో గ్రామాల్లో జనం ఆరు బయట నిద్ర పోతుంటారని, అర్ధరాత్రి సమయాల్లో చోరీలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టి, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్‌ఐలు ఆదిలక్ష్మి, తిరుమలరావు, ఏఎస్‌ఐ బీఎల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రోజుకు రెండుసార్లు శుభ్రం చేయించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

పెళ్లకూరు: శిరసనంబేడులోని ప్రధాన రహదారిని రోజుకు రెండు సార్లు శుభ్రం చేయించాలని గురువారం గ్రామస్తులు తహసీల్దార్ రామయ్యకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అమ్మన్ ట్రై స్పాంజ్ పరిశ్రమ సామర్థ్యం పెరగడం, ఉత్పత్తులు అధికం కావడంతో ముడి సరుకు భారీగా దిగుమతి అవుతుందన్నారు. దీంతో గ్రామంలోని ప్రధాన రహదారిపై తుక్కు ఇనుము ముక్కలు ఎక్కువగా రాలిపోవడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. భారీ వాహనాలు రాకపోకలతో నివాసాలు, పంట పొలాలపై దుమ్ము చేరడంతో ఇక్కట్లు పడుతున్నామన్నారు. కంపెనీ నిధులతో గ్రావెల్‌రోడ్డును సీసీరోడ్డుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

పూరిల్లు దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చిట్టమూరు: మండలంలోని కలుగుర్తిపాడులో గురువారం పూరిల్లు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొండాపురం మస్తానయ్యకు చెందిన పూరింట్లో టీవీ చూస్తుండగా మంటలు చెలరేగాయన్నారు. దీంతో ఇంట్లో ఉన్న వారు బయటకు వచ్చేశారు. స్వల్ప వ్యవధిలోనే మంటలు వ్యాప్తి చెంది పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. స్థానికుల సమాచారంతో కోట అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలు అదుపు చేశారు.

నూతన కమిటీల ఏర్పాటు

చిల్లకూరు: నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని ఆ సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆదూరు రత్నం తెలిపారు. అరుంధతీయవాడల్లో కమిటీలను నియమిస్తున్నట్లు తెలిపారు. గురువారం మండలంలోని నాంచారమ్మపేట అరుంధతీయవాడలో యువకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సలహాదారు చిగురుపాటి పవన్, మల్లికార్జున్, నందిపాక కాలయ్య, అజయ్, నాగరాజు, మల్లవరపు పెంచలయ్య పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించండి

పెళ్లకూరు: రెవెన్యూ సమస్యలపై ప్రజలు అందించే అర్జీలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ రామయ్య వీఆర్వోలు, సర్వేయర్లను ఆదేశించారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టాదారు పాసుపుస్తకం, వన్‌బీ, అడంగల్, హద్దులు చూపడం, భూ ఆక్రమణలపై వచ్చే ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలన్నారు. డీటీ శ్రీనివాసులు, ఆర్‌ఐ సంతోషిణి పాల్గొన్నారు.

‘వరి’ంచిన ఎడగారు



వేణుంబాకంలో సాగు చేసిన వరి పంట



గంగ నీటితో కళకళలాడుతున్న వేణుంబాకం పెద్ద చెరువు

సూళ్లూరుపేట నియోజకవర్గంలోని చెరువులకు తెలుగు గంగ నీరు చేరింది. ఎడగారు అనుకూలించింది. ఫలితంగా అన్నదాతల్లో ఆశలు చిగురించి..పొలం బాట పట్టారు. కనుచూపు మేర పచ్చని పైర్లు దర్శనమిస్తున్నాయి. వరి అంచనాకు మించి విస్తరించింది.

- చెరువుల్లోకి చేరుతున్న గంగ జలాలు
- ఎడగారు కింద 10వేల ఎకరాల వరి సాగు

దొరవారిసత్రం: సూళ్లూరుపేట నియోజకవర్గంలోని దొరవారిసత్రం, నాయుడుపేట, చిట్టమూరు, వాకాడు మండలాల్లోని 38 చెరువులు తెలుగు గంగ జలాలతో జలకళలాడుతున్నాయి. తెలుగు గంగ ఏడో బ్రాంచి కాలువ నుంచి సప్లయ్ చానళ్ల ద్వారా చెరువుల్లో గత ఏప్రిల్ 17వ తేదీ నుంచి గంగ నీరు క్రమేపి చేరుతూ నేటికీ వస్తోంది. దీంతో ఎడగారు కింద రైతులు రెండో పంటగా వరి సాగు చేపట్టారు. తెలుగు గంగ ఏడో బ్రాంచి కాలువ డీవీ సత్రం మండలం నెలబల్లి వరకు విస్తరించి ఉంది. ఈ కాలువ నుంచి నేరుగా వేణుంబాకం, ఏకొల్లు గ్రామాల్లోని పెద్దచెరువుల్లో గంగ నీరు చేరగా నెలబల్లి ప్రాంతం నుంచి మొదలైన తెలుగు గంగ 14ఆర్ మేజర్ కాలువ ద్వారా నెలబల్లి, నెల్లూరుపల్లె, నేలపట్టు, ముచ్చలగుంట, మైలాంగం గ్రామాల్లోని చెరువులకు కూడా గంగ నీరు చేరింది. తెలుగు గంగ 15 ఎల్ మేజర్ కాలువ ద్వారా నాయుడుపేట మండలంలోని అరవపెరిమిడి, పుదూరు, గొట్టిప్రోలు, అత్తలపాళెం, బిరదవాడ, పెళ్లకూరు మండలంలో కానూరు, చిట్టమూరు మండలంలోని యకిసిరి, యల్లసిరి, మన్నేమాల, ఉప్పలమర్తి, ఆలేటిపాడు, ఈశ్వరవాక, చిట్టమూరు వాకాడు మండలంలోని కొండాపురం గ్రామంలోని చెరువులు గంగ నీటితో నిండు కుండలా దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతాల్లో ఎడగారు కింద సుమారు 10వేల ఎకరాలు పైబడి వరి పంటను రైతులు సాగు చేస్తున్నట్లు అధికారుల అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో వరి నాట్లు, ఎలిది పంట పనులు పూర్తి కాగా మరి కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి.

1.3 టీఎంసీల నీటిని వదిలాం



దొరవారిసత్రం, నాయుడుపేట, పెళ్లకూరు, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని 38 చెరువులకు ఇప్పటి వరకు 1.3 టీఎంసీల గంగ నీటిని కాలువల ద్వారా వదలాం. కాలువలు, సప్లయ్ చానళ్ల సదుపాయం ఉన్న ప్రతి చెరువుకు గంగ నీరు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. **-సనాతన్, ఏఈ, తెలుగు గంగ, నాయుడుపేట సబ్ డివిజన్**

డీవీ సత్రంలోనే 2 వేల ఎకరాల సాగు



ఒక డీవీ సత్రం మండలంలోనే తెలుగు గంగ నీటితో ఎడగారు కింద 2 వేల ఎకరాలు వరకు వరి సాగు చేస్తున్నారు. గంగ నీటితో నాలుగేళ్ల నుంచి వేణుంబాకం, నెలబల్లి, ఏకొల్లు ప్రాంతాల్లోని రైతులు అత్యధికంగా వరిసాగు చేయడం గమనార్హం. **-తులసీరామ్, ఏఓ, దొరవారిసత్రం**

గతంలో ఎప్పుడూ లేని విధంగా..



నెలబల్లి పరిధిలోని రెండు చెరువులకు జగనన్న పాలన వచ్చినప్పటి నుంచి గంగ నీరు క్రమం తప్పకుండా చేరుతున్నాయి. దీంతో రెండో పంట కింద మూడు వందల ఎకరాల వరకు వరి పంట సాగు చేస్తున్నాం. చాలా ఆనందంగా ఉంది. **-నల్లారెడ్డి సురేష్‌రెడ్డి, రైతు, నెలబల్లి గ్రామం**

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తోందని, విద్యార్థులు చదువుల్లో వెనుకపడకుండా, క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గూడూరు క్రికెట్ క్లబ్, అల్లూరు ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్, హరిచంద్రారెడ్డి క్రికెట్ క్లబ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన వేసవి క్రికెట్ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో గురువారం ఎమ్మెల్యే మాట్లాడారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

చిట్టమూరు: మండలంలోని రామాపురంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. ఎమ్మెల్యే గురువారం రామాపురంలో పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోతలగుంటలో ఇటీవల ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన జనార్దన్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచ్ డీ విజయులురెడ్డి, నాయకులు దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి, వంకా రామాంజనేయులు, సంచి మల్లికార్జున, వంకా చెంచయ్య, షేక్ రెహ్మాన్ పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతా

గూడూరురూరల్: కల్లు గీత కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. మోగనూరు గ్రామం వద్ద రోడ్డు పక్కనే చెట్టుపై క ల్లు గీస్తున్న గీత కార్మికులను పలకరించారు. నాయకులు బత్తల వెంకటకృష్ణారెడ్డి అట్ల హరికృష్ణ, మనుబోలు సతీష్‌రెడ్డి, శంకరయ్య, రాజేష్, రాధాకృష్ణ, దర్శిగుంట కన్నయ్య, పరుశు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయం



దక్కిలి: లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

దక్కిలి: పేదరిక నిర్మూలనే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, దేశంలోనే ఏ రాష్ట్రంలేని విధంగా ఆదర్శపాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ తెలిపారు. మండలంలోని చాపలపల్లె, నాగవోలు వడ్డిపల్లెలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. లబ్దిదారులకు బుక్‌లెట్‌లు అందజేశారు. సమస్యలను తెలుసుకుంటూ.. పరిష్కారానికి చర్యలపై అధికారులకు సూచనలిస్తూ ముందుకు సాగారు. జెడ్పీటీసీ సభ్యరాలు కలిమిలి రాజేశ్వరి, ఎంపీపీ గోను రాజశేఖర్, సర్పంచ్‌లు కలిమిలి రజని, కేశాని సుజాత, జేసీఎస్ మండల ఇన్‌చార్జి చింతల శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రచారం విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్ రెడ్డి, కలిమిలి రవీంద్రారెడ్డి, పెట్లూరు జగన్‌మోహన్ రెడ్డి, మాదమాల నారాయణరెడ్డి, మల్లికార్జునరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా డీ వడ్డిపల్లెలో జాతర సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి పోలేరమ్మతల్లిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

వెంకటగిరి: నియోజకవర్గ పరిధిలోని ప్రజాసమస్య లను సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పలు సమస్యలపై వచ్చిన పలు మండలాలకు చెందిన ప్రజల నుంచి గురువారం ఆయన అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, పి దశరథరామిరెడ్డి, నాగయ్య , కె వెంకటరత్నంరాజు, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, కౌన్సిలర్‌లు వహీదా యస్దానీ, ఎన్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జగన్ సంక్షేమ పాలన దేశానికే ఆదర్శం



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

తడ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. రామాపురం పంచాయతీలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎస్సీ కాలనీ, రామాపురం కుప్పంలో పర్యటించి, స్థానికుల సమస్యలు తెలుకుంటూ, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జాలర్ల కుప్పంలో మత్స్యకారులు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో నవరత్నాల పథకాలతోపాటు మరెన్నో ఇతర పథకాలను అమలు చేసి పేదలకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు కే రఘురెడ్డి, రమేష్, జెడ్పీటీసీ సభ్యరాలు ఇందుమతి, వైస్ ఎంపీపీ కే వెంకటేష్, నాయకులు సుధాకర్, రాధాకృష్ణ, కోదండం, కే మురుగన్, ఆర్ముగం, చిన్నప్పన్, రత్నం, శేఖర్‌బాబు, రవిరెడ్డి, పాలా మహేశ్వర్, శివ కుమార్, సుబ్బారావు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేయండి



మాట్లాడుతున్న డీవైఈఓ శివప్రకాస్‌రెడ్డి

గూడూరురూరల్: రెండో విడత నాడు– నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని డీవైఈఓ శివప్రకాష్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చేపట్టిన నాడు– నేడు పనుల్లో ప్రహరీలు, అదనపు గదుల నిర్మాణాలకు మినహాయింపు ఇచ్చి, మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. తొలి విడతలో 11 పాఠశాలలకు డిజిటల్ బోర్డులు, స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేయాల్సి ఉందని, వీటికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి ఇవ్వాలని చెప్పారు. పది ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను సత్కరించడానికి వారిని గుర్తించే బాధ్యతను ఆయా హెచ్‌ఎంలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఈఈ కే రవీంద్రబాబు, డీఈ రాధాకృష్ణయ్య, ఎంఈఓ దేవరాజులరెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం



కారును ఢీ కొన్న లారీ

చిల్లకూరు: స్థానిక తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ ప్రయాణిస్తున్న కారును లారీ ఢీ కొన్న ప్రమాదంలో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. రెవెన్యూ సిబ్బంది కథనం మేరకు.. విధులకు హాజరయ్యేందుకు చిల్లకూరులోని రెవెన్యూ కార్యాలయానికి తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ కారులో బయలుదేరారు. నెల్లూరు జిల్లా చెముడు గుంటవద్ద ఆయన కారును లారీ ఢీ కొంది. దీంతో కారు ముందు భాగం దెబ్బతినగా తహసీల్దార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఆయనతోపాటు కారు డ్రైవర్ చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు వాహనంలో నెల్లూరులోని ఆస్పత్రికి వెళ్లారు.

తాటి చెట్టు కూలి రెండు గేదెలు మృతి



గేదెల కళేబరాలు

కలువాయి: పొలంలో మేతకు వెళ్లిన గేదెలపై తాటి చెట్టు కూలడంతో రెండు గేదెలు అక్కడి కక్కడే మృతి చెందిన సంఘటన కలువాయి మండలం తెలుగురాయపురంలో గురువారం జరిగింది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు వద్దిబోయిన సుబ్బారెడ్డి తాటితోపులో తన గేదెలను మేపుకునేందుకు తీసుకువెళ్లాడు. సాయంత్రం ఆకాశం మేఘావృతమై స్వల్ప వర్షంతో పాటు బలంగా గాలులు వీచాయి. గాలుల తీవ్రతకు ఓ తాటి చెట్టు కూలిపోయింది. చెట్టు కూలుతున్న విషయం గమనించిన సుబ్బారెడ్డి పక్కకు తప్పుకుని ప్రాణాలు కాపాడుకోగా గేదెలపై చెట్టు కూలి పోవడంతో అవి మరణించాయి. గేదెల విలువ రూ. లక్ష ఉంటుందని రైతు తెలిపారు.

పల్లెకి పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

వెంకటగిరిరూరల్: గ్రామాల్లో నిర్వహించనున్న మిషన్ 50 డేస్ గోటూ విలేజ్ మాదిగ పల్లె(పల్లెకు పోదాం) కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పల్లిపాటి రవిమాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని గుండ్లసముద్రంలో గురువారం మాదిగలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీవర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించి మాదిగల ఆంకాంక్షలను బీజేపీ ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ టౌన్ అధ్యక్షుడు కె మణి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు-తిరుమల సర్వీసులు పునః ప్రారంభం

గూడూరు: స్థానిక రైల్వే స్టేషన్ నుంచి, తిరుమలకు ప్రతి రోజూ ఉదయం 11.45 గంటలకు, రాత్రి 8 గంటలకూ తిరుమలకు బస్సు సర్వీసులను తిరిగి ప్రారంభించినట్లు డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం గూడూరు–తిరుమల బస్సు సర్వీసులను ఆయన గురువారం డిపోలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా గూడూరు డిపో నుంచి తిరుమలకు 13 బస్సులు తిరుగుతుండేవన్నారు. అనివార్య కారణాలతో 2020లో వాటిని పూర్తిగా నిలిపివేశామన్నారు. మళ్లీ గూడూరు డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం ప్రతి రోజూ ఉదయం 11.45 గంటలు, రాత్రి 8 గంటలకు తిరుమలకు బస్సులను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ మస్తానయ్య, శ్రీనివాసులు, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలంలోని రామాపురం, యాచవరం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లిరామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. అలాగే శనివారం మండలంలోని చుట్టి, బాలాయపల్లి గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

చాటింపునకు ముందే అంబళ్లు పోయండి

సూళ్లూరుపేట: పట్టణంలో ఉన్న చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలకు మొదటి చాటింపు వేయకముందే అమ్మవారికి అంబళ్లు పోసే కార్యక్రమానికి శుక్రవారం నుంచే శ్రీకారం చుట్టాలని ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి సూచించారు. గురువారం ఉదయం నుంచి పట్టణంలో ప్రచారం కూడా చేస్తున్నామన్నారు. శుక్రవారం సూళ్లూరు, ఇందిరానగర్, ఝాన్సీనగర్, బజారువీధికి చెందిన వారు అంబళ్లు పోయాలని కోరారు. ఆదివారం గాండ్లవీధి, సాయినగర్, మహాదేవయ్యనగర్, రాఘవయ్యపేట, కోళ్లమిట్ట, ఇసుకమిట్ట ప్రాంతాల్లో, మంగళవారం కస్వారెడ్డిపాళెం, దేగలపాళెం, బాపూజీకాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాలకుచెందిన వారంతా అంబళ్లు పోయాలని కోరారు.

మెరుగైన సేవలు అందించాలి

వెంకటగిరి: వార్డు సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య తెలిపారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీ సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.

వ్యక్తిపై కేసు నమోదు

కోట: మండలంలోని కర్లపూడి వద్ద ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడికి పాల్పడిన కర్లపూడికి చెందిన సన్నీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పుల్లారావు గురువారం తెలిపారు. బుధవారం రాత్రి ముత్తుకూరు నుంచి కోటకు వస్తున్న బస్సు డ్రైవర్‌తో మద్యం మత్తులో సన్నీ గొడవపడి, దాడికి పాల్పడ్డాడు. ఈ విషయమై బస్సు డ్రైవర్ శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై విచారణ జరిపి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

కోట: పాఠశాలల్లో జరుగుతున్న రెండో విడత నాడు–నేడు పనులను సకాలంలో పూర్తి చేయాలని డీవైఈఓ శివప్రకాష్‌రెడ్డి సూచించారు. గురువారం ఎమ్మార్సీ భవనంలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 14 పాఠశాలల్లో నాడు–నేడు పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. జూన్ 12వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి అన్నీ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. జగనన్న విద్యాకానుక కిట్లను అన్నీ పాఠశాలలకు సరఫరా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఈఓ వెంకటసునీల్ పాల్గొన్నారు.

సద్గుణాలు అలవరుచుకోవాలి



మాట్లాడుతున్న బిషప్

నాయుడుపేటటౌన్: చిన్నతనం నుంచే ప్రతిఒక్కరూ సద్గుణాలను అలవరచుకోవాలని ఎస్ఏఎల్‌సీ బిషప్ రెవరెండ్ ఓ మైకెల్ బెన్‌హర్ సూచించారు. సౌత్ ఆంధ్రా లూథరన్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన వీబీఎస్ (విరామకాల బైబిల్ స్కూల్) శిక్షణ తరగతుల ముగింపు సమావేశం గురువారం రాత్రి చర్చి ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిషప్ మాట్లాడుతూ ఎస్ఏఎల్‌సీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఐదేళ్ల చిన్నారుల నుంచి 20 ఏళ్ల యువత వరకు వీబీఎస్ శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తుందని చెప్పారు. అనంతరం వీబీఎస్ శిక్షణ తరగతులలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. అలాగే సండే స్కూల్ కరస్పాండెంట్, ఉపాధ్యాయులకు బహుమతులు ప్రదానం చేశారు. సండే స్కూల్ కరస్పాండెంట్ కే ప్రేమ్‌చంద్, ప్యారీస్ కౌన్సిల్ కమిటీ చైర్మన్ కేఎం ఆనందరావు పాల్గొన్నారు.

పొదుపు సొమ్ము స్వాహాపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పొదుపు మహిళలు

వాకాడు: మండలంలోని గంగన్నపాళెంలో పొదుపు గ్రూపులకు సంబంధించి రూ.14 లక్షల సొమ్ము స్వాహాపై గురువారం పొదుపు మహిళలు వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మహిళలు మాట్లాడుతూ గ్రామంలోని 16 గ్రూపులకు చెందిన మహిళలు చెల్లించిన రూ. 14 లక్షల సొమ్మును వెలుగు వీఓఏతోపాటు కొందరు సిబ్బంది బ్యాంక్‌లో జమ చేయకుండా స్వాహ చేశారన్నారు. దీనిపై వాకాడు ఏపీఎంకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోగా కేసులు పెడతామని బెదిరిస్తున్నారన్నారు. ఎంపీడీఓ గోపీనాథ్ మాట్లాడుతూ త్వరలోనే స్వాహ జరిగిన సొమ్మును రికవరీ చేసి, న్యాయం చేస్తామని నచ్చజెప్పి నిరసన విరమింపజేశారు.

ఉద్యానవన పంటలపై దృష్టి



సమావేశంలో పాల్గొన్న ఏపీడీ ప్రేమ్‌కుమార్

వెంకటగిరిరూరల్: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ఉద్యాన వన పంటల సాగుపై సిబ్బంది దృష్టి సారించాలని శ్రీకాళహస్తి క్లస్టర్ ఏపీడీ ప్రేమ్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ పథకం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 5 ఎకరాల లోపు ఉన్న రైతులకు పండ్లు, పూల తోటలు పెంపకానికి అనుమతులున్నాయని తెలిపారు. అలాగే ప్రతి హ్యాబిటేషన్‌లో అర్హులైన కూలీలకు పనిదినాలు కల్పించాలని సూచించారు. జాబ్‌కార్డులు లేనివారిని గుర్తించి, కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీపీ తంబిరెడ్డి త నుజారెడ్డి, ఎంపీడీఓ కరిముల్లా, ఏపీఓ దీప, నాయకులు శివారెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై దృష్టి పెట్టండి

చిల్లకూరు: ఉపాధి హామీ పథకం కింద సన్న, చిన్న కారు రైతులు మెట్ట భూముల్లో పండ్ల తోటలు పెంపకంపై దృష్టి సారించాలని ఎంపీడీఓ గోపీనాథ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సహాయకులతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద మండలంలో 100 ఎకరాల్లో పండ్ల తోటలు పెంపకం లక్ష్యం పెట్టారన్నారు. దీనిపై ఓ వైపు ఉపాధి క్షేత్ర సహాయకులు పని చేస్తుండగా వ్యవసాయ సహాయకులు కూడా తమకు తెలిసిన సన్న చిన్న కారు రైతులకు మెట్ట భూముల్లో వేసుకునే పండ్ల రకాలపై అవగాహన కల్పించి వారికి సంబంధించిన భూమి వివరాలను ఉపాధి కార్యాలయంలో తెలియజేస్తే వారికి పండ్ల తోటకు అయ్యే ఖర్చును అందించేలా చూస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ గిరి పాల్గొన్నారు.